క్లుప్తంగా

‘అయ్యంకి’కి ఘనంగా నివాళులు



అయ్యంకి వెంకటరమణయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న లైబ్రేరియన్ మహేష్, పాఠకులు

డెంకాడ: స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయోద్యమ పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్య జయంతి గురువారం నిర్వహించారు. లైబ్రేరియన్ వై.మహేష్, పాఠకులు కలిసి అయ్యంకి చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. అనంతరం గ్రంథాలయాల ఏర్పాటుకు వెంకటరమణయ్య చేసిన కృషిని వక్తలు కొనియాడారు. గ్రంథాలయాల కోసం ఆయన చేసిన విశేష కృషిని కేంద్ర ప్రభుత్వం గుర్తిస్తూ పద్మశ్రీ పురస్కారంతో కూడా గౌరవించిందన్నారు.

సన్మానం



సచివాలయ సిబ్బందిని సన్మానిస్తున్న సర్పంచ్ విజయభాస్కర్‌రెడ్డి తదితరులు

భోగాపురం: మండలంలోని సవరవల్లి గ్రామ సచివాలయంలో పనిచేసి వేరే ప్రాంతానికి బదిలీ అయిన సిబ్బందిని గురువారం సన్మానించారు. అనంతరం వారి సేవలను సర్పంచ్ ఉప్పాడ విజయభాస్కర్‌రెడ్డి ప్రశంసించారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చి, కొన్ని లక్షల మంది నిరుద్యోగులకు ఉద్యోగాలిచ్చారని గుర్తు చేశారు. ఏ ప్రాంతానికి వెళ్లినా పార్టీలకు అతీతంగా సేవలందిస్తూ మంచిపేరు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పట్నాన తాతయ్యలు, మాజీ వైస్ సర్పంచ్ పూసర్ల వెంకటరమణ పాల్గొన్నారు.

సస్యరక్షణతోనే అధిక దిగుబడులు



అవగాహన కల్పిస్తున్న రైతు శిక్షణా కేంద్రం మేనేజరు నిర్మల

పూసపాటిరేగ: వరి సాగులో చేపట్టే సమగ్ర సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడులు సాధించవచ్చని రైతు శిక్షణా కేంద్రం మేనేజరు పి.నిర్మల అన్నారు. మండలంలోని అల్లాడ పాలెం రైతు సేవా కేంద్రంలో వరి సాగు సస్యరక్షణ చర్యలపై గురువారం అవగాహన కల్పించారు. వరి నారుమడి ఏ విధంగా సిద్ధం చేసుకోవాలి, నాట్లు వేయడం, ఎరువుల యాజమాన్యం తెలియజేశారు. ఏవో కె.నీలిమ మాట్లాడుతూ పచ్చిరొట్ట ఎరువుల ఆవశ్యకత, నవధాన్యాలు భూమికి చేసే మేలును వివరించారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి కె.గోవిందమ్మ తదితరులు పాల్గొన్నారు.

దస్తూరీ మెరుగుపడాలి



విద్యార్థులతో పాఠ్యాంశాలు చదివిస్తున్న ఎంఈఓ బాలభాస్కరరావు

వేపాడ: విద్యార్థుల దస్తూరీ మెరుగుపడేలా వారికి హోంవర్కు ఇవ్వాలని ఉపాధ్యాయులకు ఎంఈఓ బాలభాస్కరరావు సూచించారు.ఆతవ ప్రాథమిక పాఠశాలను గురువారం ఆయన సందర్శించారు. పిల్లల వర్క్ బుక్స్, వారికి ఇచ్చిన సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర కిట్లను పరిశీలించారు. విద్యార్థులతో పాఠ్యాంశాలు చదివించి వారి విద్యాసామర్థ్యాన్ని పరీక్షించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనాలు అందించాలని వంట నిర్వాహకులకు సూచించారు.

ఆశ కార్యకర్త పోస్టుకు దరఖాస్తుల స్వీకరణ

బొండపల్లి: మండల కేంద్రంలో ఖాళీగా ఉన్న ఆశ కార్యకర్త పోస్టు భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తూ స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ఎల్.సత్యనారాయణ గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. 10వ తరగతి ఉత్తీర్ణులైన 35 ఏళ్లలోపు ఉన్న స్థానిక మహిళలు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు ఈనెల 26లోగా స్థానిక సచివాలయంలో లేదా పీహెచ్‌సీలో కాని దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

వెంకటరమణయ్య జయంతి

చీపురుపల్లి రూరల్(గరివిడి): చీపురుపల్లి శాఖా గ్రంథాలయంలో గురువారం అయ్యంకి వెంకటరమణయ్య జయంతిని నిర్వహించారు. లైబ్రేరియన్ ఎం.ఉషారాణి ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వెంకటరమణయ్య గ్రంథాలయమే సర్వస్వం అనే పత్రికను నిర్వహించారని గుర్తు చేశారు.

ప్రభుత్వ వైఫల్యాలు ఎండగడదాం

- బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీలో నెల్లిమర్ల మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బడ్డుకొండ అప్పలనాయుడు



బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ బ్రోచర్లు ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ, తదితరులు



కొప్పెర్ల సభలో కూటమి మోసాలపై మండిపడుతున్న మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

పూసపాటిరేగ: కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడదామని, ప్రజలకు చేస్తున్న ప్రతి మోసాన్ని ప్రజాక్షేత్రంలో వివరించాలని నెల్లిమర్ల మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా మండలంలోని పూసపాటిపాలెం, కొప్పెర్ల, వెల్దూరు, తిప్పలవలస, కోనాడ, లంకలపల్లిపాలెం గ్రామాల్లో గురువారం పర్యటించిన ఆయనకు ఆయా గ్రామాల ప్రజలు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి సీఎం చంద్రబాబు అండ్ కో ప్రజలను మోసగిస్తున్న తీరును, అప్పటి వైఎస్సార్ సీపీ పాలనకు ఇప్పటి కూటమి పాలనకు ఉన్న తేడాను తెలియజేశారు. ఆ తర్వాత జరిగిన సభల్లో ప్రజలను అమాయకులను చేస్తూ కూటమి సర్కారు, ఆ పార్టీల నాయకులు చేస్తున్న నయవంచనను ఎండగట్టారు. వైఎస్సార్ సీపీ హయాంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా రాష్ట్ర సమగ్రాభివృద్ధి, ప్రజాసంక్షేమమే ధ్యేయంగా పాలన కొనసాగిస్తే ప్రస్తుత సీఎం చంద్రబాబు వారి పార్టీ నాయకులకు ప్రజాధనం దోచిపెట్టడం, ప్రతిపక్ష నాయకులపై దాడులకు ఎగబడడాన్ని ప్రోత్సహిస్తున్నారని విమర్శించారు. ఓట్లు కోసం లేనిపోని హామీలతో ప్రజలను మభ్యపెట్టి తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత అవేమీ అమలు చేయకుండా కాలం వెల్లదీయడం మోసం కాదా అని అన్నారు. ఇప్పటివరకు ఇచ్చిన రెండు పథకాల్లోనూ లబ్ధిదారులకు అన్యాయమే జరిగిందన్నారు.

ఒక్కొక్కరికి ఒక్కో రకంగా..

కొంతమందికి గ్యాస్ డబ్బులు పడితే మరికొంత మందికి పడలేదని, తల్లికి వందనం పథకం కింద కొంతమందికి రూ.13 వేలు పడితే ఇంకొంతమందికి రూ.10 వేలు, రూ.8 వేలు లెక్కన పడ్డాయన్నారు. ఇలా ఒక్కొక్కరికి ఒక్కో రకంగా ఎందుకు పడిందో తెలియక లబ్ధిదారులు తలలు పట్టుకుంటున్నారన్నారు. ఇలా ప్రజలను బురిడీ కొట్టించి తాము పథకాలన్నీ అమలు చేసేశామన్నట్లుగా సుపరిపాలనకు ఏడాది పేరిట కార్యక్రమం నిర్వహించుకోవడం సిగ్గుచేటన్నారు. ఇటీవల మంత్రి అచ్చెన్నాయుడును ఓ సమావేశంలో ఆడబిడ్డ నిధి ఎప్పుడిస్తారని మహిళలు అడిగితే అది ఇవ్వాలంటే రాష్ట్రాన్ని అమ్ముకోవాల్సిందేనని ఆయన అనడం దుర్మార్గమని, వారు హామీలు ఇచ్చినప్పుడు తెలీదా రాష్ట్ర బడ్జెట్ అంత లేదని..మండిపడ్డారు. ఇప్పుడే కూటమి చేస్తున్న మోసాలను ప్రజలు గ్రహిస్తున్నారని, వారే రాబోయే రోజుల్లో గట్టి బుద్ధి చెబుతారని హితవుపలికారు.

ఉద్యోగాలెన్నిచ్చారో చెప్పండి?

వెలుదూరులో జరిగిన సభలో నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి తీరుపై ధ్వజమెత్తారు. ఆమె గెలిచిన వంద రోజుల్లో వంద కంపెనీలు తెచ్చి నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చారని, ఇప్పటివరకు ఎన్ని కంపెనీలు తెచ్చారు..?ఎంతమందికి ఉద్యోగాలిచ్చారని ప్రశ్నించారు. నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఎన్ని జాబ్‌మేళాలు నిర్వహించి ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారని, మీ సొంత కంపెనీ అయిన మిరాకిల్‌లో ఎవరెవరికి ఉద్యోగాలిచ్చారని నిలదీశారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై దృష్టిపెట్టాలని, అంతే తప్ప కక్షపూరిత రాజకీయాలను ప్రోత్సహించకూడదన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పతివాడ అప్పలనాయుడు, ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి రేగాని శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీలు అల్లాడ రమేష్, ఎన్.సత్యనారాయణరాజు, పార్టీ అంగన్‌వాడీ అసోసియేషన్ ప్రతినిధి పి.కృష్ణవేణి, నాయకులు ఎం.శ్రీనివాసరావు, బర్రి చినఅప్పన్న, ఎం.జనార్దనరావు, డి.త్రినాథరావు పాల్గొన్నారు.

‘దారి’ద్రం





నెల్లిమర్లలోని ప్రసిద్ధ పుణ్య క్షేత్రం రామతీర్థం వద్ద రోడ్డు అధ్వానంగా తయారైంది. రోడ్డు పొడవునా భారీ గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా కనిపిస్తోంది. గోతుల వద్ద రోడ్డుకు ఇరువైపులా వచ్చే వాహనాలు ఒకదానికొకటి దారి ఇచ్చుకునే సమయంలో కొన్ని గుంతలలో పడిపోతున్నాయని, రాత్రిపూట ప్రయాణాల్లో పలువురు వాహనదారులు గోతుల్లో పడి గాయాలపాలవుతున్నారని స్థానికులు, సందర్శకులు, యాత్రికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారంలోకి వస్తే అద్దంలా మెరిసే రోడ్లు వేసి చూపిస్తామన్నారు.. ఇదేనా? ఇలాగేనా? రోడ్లు అని పలువురు నిలదీస్తున్నారు. ఇప్పటికైనా రోడ్డు మరమ్మతులు చేపట్టి, ప్రయాణికుల ప్రయాణానికి భద్రత కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం

నేటి నుంచి భోగాపురంలో ‘బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ’



యు.సూర్యనారాయణరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్

భోగాపురం: మండలంలో శుక్రవారం నుంచి బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి తెలిపారు. ఇదే విషయమై ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. తొలుత సవరవల్లి గ్రామంలో ఉదయం 9 గంటలకు పార్టీ మండల విస్తృత స్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం రావాడ, తూడెం, కవులవాడ, పోలిపల్లి, లింగాలవలస గ్రామాల్లో బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ రచ్చబండ సమావేశాలు ఉంటాయన్నారు. 26న రావివలస, గూడెపువలస, దల్లిపేట, బైరెడ్డిపాలెం, రెడ్డికంచేరు, చేపల కంచేరు, ముక్కాం, కొండ్రాజుపాలెం, 27న నందిగాం, ముంజేరు, రామచంద్రపేట, బాకివలస, చెరుకుపల్లి, గుడివాడ, రాజాపులోవ, భోగాపురం గ్రామాల్లో సమావేశాలు ఉంటాయన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులంతా ఈ సమావేశాలకు హాజరై, విజయవంతం చేయాలని కోరారు.

ఈ–క్రాప్ నమోదు పరిశీలన

డెంకాడ: మండలంలోని సింగవరం గ్రామంలో జరుగుతున్న ఈ–క్రాప్ నమోదు ప్రక్రియను మండల వ్యవసాయాధికారిణి టి.సంగీత గురువారం పరిశీలించారు. అనంతరం ఆమె కౌలురైతులకు రుణ సదుపాయం కల్పించాలని గ్రామంలోని డెంకాడలోని బ్యాంకు అధికారులను కలిసి విజ్ఞప్తి చేశారు. అలాగే వ్యవసాయ పరపతి సంఘం కార్యాలయానికి వెళ్లి, ఎరువుల పంపిణీపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆమె వెంట ఏఈవో బి.రామకోటి తదితరులు ఉన్నారు.

28న కలెక్టరేట్ వద్ద ధర్నా



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీఐటీయూ, ఆటో యూనియన్ నాయకులు

విజయనగరం గంటస్తంభం: కలెక్టరేట్ వద్ద ఈ నెల 28వ తేదీన విజయనగరం జిల్లా ఆటో వర్కర్స్ యూనియన్, సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తున్నామని, ఆటో కార్మికులంతా ధర్నాలో పాల్గొని, విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్, నగర అధ్యక్షుడు ఎ.జగన్మోహనరావు, ఉపాధ్యక్షుడు రెడ్డి శంకరరావులు పిలుపునిచ్చారు. ఇదే విషయమై జిల్లా కేంద్రంలోని కోట జంక్షన్ వద్ద విలేకరుల సమావేశం గురువారం నిర్వహించి, మాట్లాడారు. ఆగస్టు 15 నుంచి రాష్ట్ర ప్రభుత్వం ఇస్తామంటున్న మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని స్వాగతిస్తున్నామని, అయితే దీని ద్వారా ఆటో, వ్యాన్ డ్రైవర్లకు జరిగే నష్టాన్ని ఏ విధంగా భర్తీ చేస్తారో చెప్పాలని ప్రశ్నించారు. లైసెన్స్ కలిగిన ప్రతి డ్రైవర్‌కూ రూ.15 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వాహన రెన్యువల్, రిజిస్ట్రేషన్, లైసెన్స్ వంటి సేవలన్నింటికీ ఆర్టీవో అధికారులే బాధ్యత వహించేలా చూడాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే జీవో నంబరు 21 రద్దు చేస్తామని హామీ ఇచ్చారని, ఆ జీవో రద్దు చేయకపోగా ఫీజులు, పెనాల్టీలు, టోల్, గ్రీన్ టాక్సులు పెంచారని ఆందోళన వ్యక్తం చేశారు. నగరంలో ఆటోల నిలుపుదలకు పార్కింగ్ స్థలాలు లేవని, అవి కేటాయించాల్సిన అధికార యంత్రాంగం ట్రాఫిక్ నిబంధనల పేరిట ఈ చలానాలు, పెట్టి కేసులు నమోదు చేస్తున్నాయని, స్టాండ్‌ల వారీగా వివరాలు సేకరిస్తున్నారన్నారు. కొత్త ఆటోల కొనుగోళ్లకు ప్రభుత్వం వడ్డీ లేని రుణాలు మంజూరు చేయాలని కోరారు. అనంతరం ధర్నా వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. సమావేశంలో ఆటో యూనియన్ నాయకులు బి.పాపారావు, కె.రామునాయుడు, జి.కూర్మారావు, రామారావు, బంగార్రాజు, నర్సింగ్ తదతరులు పాల్గొన్నారు.

25 నుంచి పైడితల్లికి శ్రావణమాస పూజలు



పూజలందుకుంటున్న పైడితల్లి

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్యదైవం, భక్తుల పాలిట కల్పవల్లిగా పేరొందిన శ్రీపైడితల్లి అమ్మవారికి ఈ నెల 25 నుంచి ఆగస్టు 22వ తేదీ వరకు శ్రావణమాస పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో కె.శిరీష గురువారం తెలిపారు. ప్రతి మంగళవారం వేకువజామున 4 గంటలకే పంచామృతాలతో అభిషేకాలు, ప్రతిరోజూ కుంకుమార్చనలు చేస్తామని, శ్రావణ శుక్రవారాల్లో పూజలు చేసేందుకు వచ్చే మహిళల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తామన్నారు. అమ్మవారికి శ్రీచక్ర కుంకుమార్చనలు, శ్రావణ పౌర్ణమి రోజున స్వర్ణ పుష్పార్చనలు ఉంటాయన్నారు. కుంకుమార్చనల్లో పాల్గొనే భక్తులు సంప్రదాయ వస్త్రధారణల్లో రావాలని, ప్లాస్టిక్ నిషేధం పాటించాలని కోరారు. ఆగస్టు 22న ఉదయం 8 గంటలకు రైల్వేస్టేషన్ వనంగుడి వద్ద ఉచిత సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహిస్తామన్నారు. మరిన్ని వివరాలకు 08922–233744(చదురుగుడి), 08922–233972 (వనంగుడి) నంబర్లు సంప్రదించాలని కోరారు.

శక్తి యాప్‌పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ గోవిందరావు

విజయనగరం క్రైమ్: స్థానిక కంటోన్మెంట్ మున్సిపల్ పాఠశాలలో శక్తి యాప్ వినియోగం, దాని ప్రయోజనాలపై గురువారం అవగాహన కల్పించారు. మహిళల భద్రత కోసం ప్రభుత్వం తీసుకువచ్చిన ఈ యాప్‌ను ప్రతిఒక్కరూ డౌన్‌లోడ్ చేసుకోవాలని మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీ ఆర్.గోవిందరావు తెలిపారు. ఆపదలో ఉన్న వారెవరైనా యాప్‌లోని ఎస్‌వోఎస్ కాల్ చేస్తే క్షణాల్లో పోలీసుల సాయం పొంది రక్షణ పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ శిరీష, విద్యార్థులు పాల్గొన్నారు.

రానున్న రోజుల్లో ‘ఏఐ’దే కీలక పాత్ర



ఇన్నోవేషన్స్ ఇన్ హెల్త్‌కేర్ పుస్తకాలు ఆవిష్కరిస్తున్న వర్సిటీ చాన్సలర్ రాజు, తదితరులు

నెల్లిమర్ల రూరల్: వైద్య రంగంలో రానున్న రోజుల్లో ఏఐ(ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్)దే కీలక పాత్ర అని సెంచూరియన్ యూనివర్సిటీ చాన్సలర్ ప్రొఫెసర్ జీఎస్ఎన్ రాజు అన్నారు. మండలంలోని టెక్కలి సెంచూరియన్ వర్సిటీలో ‘ఇన్నోవేషన్స్ ఇన్ హెల్త్‌కేర్’ పేరిట మూడు రోజుల పాటు జరిగే అంతర్జాతీయ సదస్సు గురువారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యాధునిక పరికరాల రూపకల్పనలో ఇంజినీరింగ్, వైద్య రంగాలు కలిసి పనిచేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. నేడు కొత్త కొత్త రోగాలను గుర్తించడంలో అత్యాధునిక వైద్య పరికరాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయన్నారు. భవిష్యత్‌లో ఏఐ కూడా కీలక పాత్ర పోషిస్తుందన్నారు. పరిశోధనలు చేసే విద్యార్థులకు జాతీయ స్థాయి సెమినార్ ఎంతగానో దోహదపడుతుందన్నారు. సౌదీ అరేబియాలో ఖాసిమ్ వర్సిటీకి చెందిన నవీన్‌కుమార్ మాట్లాడుతూ ప్రపంచ జనాభా 800 కోట్లలో 13 శాతం మంది మధుమేహంతో బాధపడుతూ కంటిచూపు కోల్పోతున్నారని, వ్యాధిగ్రస్తుల్లో రెటినోపతిని గుర్తిస్తే కంటి చూపు పోకుండా కాపాడవచ్చన్నారు. అనంతరం ‘ఇన్నోవేషన్స్ ఇన్ హెల్త్ కేర్’ అవగాహన పుస్తకాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో వీసీ పీకే మహంతి తదితరులు పాల్గొన్నారు.

ముందుకు సాగని వరినాట్లు..!

- చిటపట చినుకులే తప్ప భారీ వర్షాల జాడలేదు
- నీరులేక వెలవెలబోతున్న చెరువులు
- బోరుబావులు ఉన్నచోటే వరి నాట్లు
- ముదురుతున్న వరినారు..బోరుమంటున్న అన్నదాతలు
- గజపతినగరం వ్యవసాయశాఖ సబ్ డివిజన్ పరిధిలో ఖరీఫ్ వరి సాధారణ సాగు విస్తీర్ణం వివరాలు

మండలం	సాధారణ సాగు విస్తీర్ణం(హెక్టార్లు)	నాట్లు పూర్తయిన విస్తీర్ణం(హెక్టార్లు)
గజపతినగరం	3,691	330
బొండపల్లి	2,558	172
దత్తిరాజేరు	3203	44
మెంటాడ	3422	71



గజపతినగరం మండలం సాలిపేట గ్రామంలో నీరులేని చెరువు



మెంటాడ మండలం చల్లపేటలో బోరుబావులు ఆధారంగా వరి నాట్లు వేస్తున్న రైతులు

గజపతినగరం: మునుపెన్నడూ లేని విధంగా జూలై నెలలో విభిన్న వాతావరణ పరిస్థితులు ఉన్నాయి.మే నెలను తలపించేలా ఓవైపు ఎండతీవ్రత ఉంటోంది. అలాగే అడపాదడపా చిరుజల్లులు కురుస్తున్నాయి. చిటపట చినుకులే తప్ప భారీ వర్షాల జాడ కనిపించకపోవడంతో ఖరీఫ్ వరిసాగు చేయాలనుకునే రైతులు ఆందోళన చెందుతున్నారు. ఖరీఫ్ వరి నాట్లు వేసేందుకు సమయం దాటిపోతున్నా ఇంకా గజపతినగరం వ్యవసాయ శాఖ సబ్ డివిజన్ పరిధిలో ఓ మోస్తారుగా కూడా వరి నాట్లు పూర్తి కాలేదు. వ్యవసాయ బోరు బావులు ఉన్న చోట తప్ప చెరువుల కింద ఎక్కడా ఇంకా నాట్లు పడలేదు. గజపతినగరం వ్యవసాయ శాఖ సబ్ డివిజన్ పరిధిలోని గజపతినగరం, బొండపల్లి, దత్తిరాజేరు, మెంటాడ మండలాల్లో ఏటా ఖరీఫ్ వరి సాధారణ సాగు విస్తీర్ణం మొత్తం 12,874 హెక్టార్లు కాగా ఇప్పటి వరకు కేవలం 617 హెక్టార్లలో మాత్రమే ఉభాలు జరిగాయి. ఈ సమయానికి వరి నాట్లు 50 శాతానికి పైగా పూర్తి కావాల్సి ఉంది. కానీ వర్షాభావంతో వరి నాట్లు ముందుకు సాగడం లేదు.

ఆశించిన స్థాయిలో కురవని వర్షాలు

వరి నారు పోసిన నాటి నుంచి అప్పుడప్పుడూ చిరుజల్లులు కురవడమే తప్ప చెప్పుకోదగిన వర్షం కురవలేదని, నారును కాపాడుకోవడానికే నానా పాట్లు పడాల్సి వచ్చిందని రైతులు చెబుతున్నారు. గజపతినగరం వ్యవసాయ శాఖ సబ్ డివిజన్ పరిధిలో సాగునీటి కాలువలు,బోరుబావులు ఉన్న చోట మాత్రమే ఉభాలు జరుగుతున్నాయి. వర్షాధారంగా వరి నాట్లు వేయాలనుకునే వారు ఆశగా ఆకాశం వైపు చూస్తున్నారు. నారు ముదురు పోతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వరుణుడు ముఖం చాటేసి, భానుడి ప్రతాపం ఇలాగే కొనసాగితే పంటకు నష్టం తప్పదని వరి నాట్లు వేసిన రైతుల్లో కూడా ఆందోళన కనిపిస్తోంది.

ఇంకా సమయం ఉంది



వరి నాట్లు వేసేందుకు ఇంకా సమయం ఉంది. రైతులు ఆందోళన చెందవద్దు. వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయి. ఆగస్టు మూడో వారం వరకు నాట్లు వేసుకోవచ్చు. అన్నిగ్రామాల్లో శతశాతం ఉభాలు పూర్తవుతాయని భావిస్తున్నాం. వర్షాలు లేకపోతే ప్రత్యామ్నాయంగా మొక్కజొన్న, కంది,అపరాలు,తదితర పంటలు సాగు చేసుకునేలా విత్తనాలు సిద్ధం చేశాం.

– వి.కిరణ్‌కుమార్, ఏఓ, గజపతినగరం మండలం

వేతనాలు పెంచండి

విజయనగరం: కార్పొరేషన్ పరిధిలోని గాజులరేగ, అయ్యన్నపేట, జమ్మునారాయణపురం, ధర్మపురి విలీన ప్రాంతాల కార్మికులకు ఆప్కాస్‌లోని ఇంజినీరింగ్ కార్మికులతో సమానంగా పెరిగిన వేతనాలు ఇవ్వాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎ.జగన్మోహనరావు, కె.ఆదినారాయణ, భాస్కరరావు డిమాండ్ చేశారు. ఇదే విషయమై వారు కమిషనర్ పల్లి నల్లనయ్యను విజయనగరంలో గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. గత 25 ఏళ్లుగా నీటి సరఫరా విభాగంలో పనిచేస్తున్న కార్మికులను ఆప్కాస్‌లో చేర్చకపోవడం తీవ్ర అన్యాయమన్నారు. కార్పొరేషన్ ద్వారా ప్రస్తుతం ఇస్తున్న రూ.15 వేలు వేతనాన్ని రూ.18,500 పెంచుతూ ప్రభుత్వం జీవో జారీ చేసిందన్నారు. వీరితో పాటు విలీన ప్రాంతాల కార్మికులకూ వేతనాన్ని పెంచాలని విజ్ఞప్తి చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఫెడరేషన్ నాయకులు పాపారావు తదితరులు పాల్గొన్నారు.

27న సాహితీ సదస్సు

విజయనగరం టౌన్: స్థానిక గురజాడ స్మారక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఈ నెల 27వ తేదీన విజయభావన సాహితీ సదస్సు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఎ.గోపాలరావు ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. త్యాగధనుడు–లక్ష్మణుడు అనే అంశంపై ఎస్‌వీబీసీ విశ్రాంత అధికారిణి డాక్టర్ కేవీ హరిప్రియ ప్రసంగిస్తారన్నారు. సాహితీవేత్తలంతా ఈ కార్యక్రమానికి హాజరుకావాలని ఆయన కోరారు.